క్లుప్తంగా

ఆర్థికసాయం



చిట్యాల : మండల కేంద్రానికి చెందిన చిలుముల రాజేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో 2006 బ్యాచ్‌కి చెందిన తోటి మిత్రులు బుధవారం రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. మిత్రుడికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చింతల మహేందర్, మురహారి భానుచందర్, పాశిగంటి మహేందర్, జెట్టి తిరుపతి, గుండ తిరుపతి, శ్రీపతి రమేష్, ఉయ్యాల రమేష్, కర్నే కమలాకర్, తదితరులు ఉన్నారు.

పరామర్శ

మొగుళ్లపల్లి : మండలంలోని కోర్కిశాల మాజీ సర్పంచ్ అప్పం మల్లక్క అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని బుధవారం చిట్యాల మార్కెట్ చైర్మన్ కొడారి రమేష్ యాదవ్, మొగుళ్లపల్లి సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి పున్నంచందర్ రావు, సర్పంచ్‌లు యుగేందర్, రాములు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

చిట్యాల : మండల కేంద్రానికి చెందిన ముసాపూరి రమేశ్ విద్యుత్ వైర్లకు తగిలి తీవ్ర గాయాలపాలయ్యాడు. బుధవారం రమేశ్ తన ఇంటిపై ఉన్న ఇనుప పైపులను కిందకి దింపుతుండగా పైన ఉన్న 11కేవీ విద్యుత్ లైన్‌కి తగిలి ప్రమాదవశాత్తు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక సివిల్ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించారు.

చికిత్స పొందుతున్న యువతి మృతి



అంజలి (ఫైల్)

మొగుళ్లపల్లి : పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన యువతి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చెక్క రాజయ్యకు ఇద్దరు కూతుళ్లు. మేస్త్రీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చిన్న కూతురు అంజలి(18) ఇంట్లో ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో ఇంటర్ వరకు చదివి ఇంటి వద్దే ఉంటుంది. ఆమెకు కాస్తా ఆరోగ్యం బాగాలేకపోవడం, ఇంట్లో వాళ్లు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. దీంతో పెళ్లి ఇష్టం లేక ఆరోగ్య పరిస్థితి కూడా బాగోలేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై గత నెల 28వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

ఎస్ఎస్ తాడ్వాయి : ఓట్ల కోసం మభ్యపెడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్‌ముదిరాజ్, ఏటూరునాగారం బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు, సర్పంచ్ రేగ కళ్యాణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కామారం గ్రామపంచాయతీ పరిధిలోని మర్రిగుంపునకు చెందిన బీఆర్ఎస్ పార్టీ, బీజేపీ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో ప్రజలకు చేసింది ఏం లేదన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్‌గౌడ్, జిల్లా నాయకుడు అరెం లచ్చుపటేల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్రకోల తిరుపతి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరిల వెంకన్న, నాయకులు సూర్యనారాయణ, కొర్నబెల్లి వీరేశం, తాడ్వాయి గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ యానాల సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

గ్రామసభ అడ్డగింత

ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని నార్లాపూర్ గ్రామ పంచాయతీలో బుధవారం ఏర్పాటు చేసిన పెసా గ్రామసభను కాంగ్రెస్ నాయకులు అడుకున్నారు. గృహలక్ష్మి, బీసీ బంధు, దళిత బంధు పథకాలకు లబ్ధిదారులను గ్రామ సభ ద్వారా ఎంపిక చేయకుండా ఇష్టారీతిన అనర్హులను ఎంపిక చేశారని గ్రామసభను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉండగా అనర్హులను ఎలా ఎంపిక చేస్తారని పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. గ్రామంలో స్థానికేతరుల లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రకటించారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు గృహలక్ష్మి, దళితబంధు జాబితాను రద్దు చేసి గ్రామసభ ద్వారా పారదర్శకంగా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శికి నాయకులు వినతి పత్రం అందజేశారు.

భిక్షాటన చేస్తున్న ఆశ వర్కర్లు



కాటారం: భిక్షాటన చేస్తున్న ఆశ కార్యకర్తలు



ఆశ వర్కర్లను ఆదుకోవాలి



చిట్యాల: సమ్మెకు మద్దతు తెలుపుతున్న కీర్తిరెడ్డి

చిట్యాల : కరోనా సమయంలో ప్రజలకు ఎంతో అండగా ఉన్న ఆశ వర్కర్లను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీజేపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఆశ వర్కర్లు చేస్తున్న సమ్మెకు మద్దతుగా సంఘీభావం తెలిపారు. ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. లేని ఎడల బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు.కార్యక్రమంలో చాడ రఘునాథరెడ్డి, మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, నాయకులు మాచర్ల రఘు, రాయిని శ్రీనివాస్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల భిక్షాటన

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో ఆశ వర్కర్లు భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు కుంచాల రాధిక మాట్లాడారు. పది రోజులుగా సమ్మె చేస్తున్న కనీసం ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు సుమలత, లక్ష్మి, కళ్యాణి, మానస, అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల వినూత్న నిరసన

కాటారం : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆశ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం ఆశ కార్యకర్తలు మండల కేంద్రంలో భిక్షాటన చేసి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. ప్రధాన కూడలిలోని వ్యాపార సముదాయాలు, ఇళ్ల వద్దకు వెళ్లి భిక్షం అడిగి తమ ఆవేదన వెలిబుచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా తాము నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కరోనా సమయంలో ఆశ వర్కర్ల సేవలను కొనియాడుతూ పొగడ్తలతో ముంచేత్తిన ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు



సమావేశంలో మాట్లాడుతున్న కీర్తి రెడ్డి

భూపాలపల్లి రూరల్ : రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. బుధవారం భూపాలపల్లిలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కన్నం యుగంధర్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు వెచ్చించి అనేక ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తుండగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ పథకాలను నీరుగారుస్తూ పథకాల పేరు మారుస్తున్నాడన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి పాలన చూస్తే కేంద్ర ప్రభుత్వానివి.. నిధులు రాష్ట్ర ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరనీయకుండా ఆ పథకాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం పేరు చెప్పి ముఖ్యమంత్రి కేసీఆర్ లబ్ధి పొందాలని చూస్తున్నారని కీర్తి రెడ్డి ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో రాష్ట్రంలో, బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమన్నారు. అదేవిధంగా భూపాలపల్లి నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీకి ప్రజల నుంచి ఆదరణ లభిస్తుందని భూపాలపల్లిలో కాషాయ జెండా ఎగరవేయటం ఖాయమన్నారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఎన్నికల కోడ్ వస్తుందని వివిధ పథకాలకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేస్తున్నారే తప్ప ఆ పథకాలకు నిధుల కేటాయింపు జరగలేదన్నారు. ప్రజలు మాయమాటలు నమ్మే స్థితిలో లేరన్నారు. మైలారంలో జర్నలిస్టులతో పాటు మైలారం గ్రామ నిరుపేదల నివాసాలకు భూములు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపల్లి పాపయ్య, వరంగల్ పార్లమెంటు కో కన్వీనర్ పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చాడ రఘునాథరెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి ఎరుకల గణపతి, పట్టణ అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి, తుమ్మేటి రాంరెడ్డి, మాచినవేణి రవీందర్, ఆసం సురేష్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సత్యవతి పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

టేకుమట్ల : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023–24 సంవత్సరంలో పండ్ల తోటల పెంపకానికి రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ సురేందర్ ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పంట పొలాల్లో పండ్ల మొక్కలను పెంచుకోవచ్చని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, సన్నకారు రైతులు అర్హులని, ఐదు ఎకరాల లోపు పట్టాదారులు, ఉపాధి హామీ జాబ్ కార్డు, బోరుబావి కలిగి విద్యుత్ సదుపాయం ఉన్నవారు అర్హులన్నారు. అవసరమైన రైతులు దరఖాస్తు పత్రం, పట్టాపాసు బుక్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, ఆధార్‌కార్డు, జాబ్ కార్డు, పాన్‌కార్డు, మూడు పాస్‌ఫొటోలు, గ్రామ పంచాయతీ తీర్మానం తీసుకుని జీపీ కార్యదర్శికి లేదా ఏఈఓ, ఏపీఓలకు అందజేయాలని కోరారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సురేందర్ కోరారు.

ఓటరు తుది జాబితా ప్రచురణ

మల్హర్ : మండల వ్యాప్తంగా 22 పోలింగ్ బూత్‌ల వద్ద ఓటరు తుది జాబితాను బుధవారం ప్రచురించినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుది జాబితాలో మొత్తం 21,168 మంది ఓటర్లు నమోదైనట్లు తెలిపారు. పురుషులు 10,441, స్త్రీలు 10,727 మంది జాబితాలో నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు. బీఎల్‌ఓ కేంద్రాల్లో ఓటరు జాబితాలో పేర్లను చూసుకోవాలని ఓటర్లుకు సూచించారు. భారత ఎన్నికల కమిషన్ నిబంధన మేరకు 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించామన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

భూపాలపల్లి రూరల్ : ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈనెల 7వ తేదీన జోగులాంబ జిల్లా అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు చేపట్టనున్న విశ్వరూప పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బట్టవిజయ్ కుమార్ అధ్వర్యంలో నాయకులు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో పాదయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

15శాతం ఐఆర్ ఇవ్వాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

ఏటూరునాగారం : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రకటించిన 5శాతం మధ్యంతర భృతిని రద్దు చేసి 15 శాతం ఐఆర్ ఇవ్వాలని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం తెలిపారు. అనంతరం రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని చాలా తక్కువగా 5శాతం ప్రకటిస్తూ జీఓ విడుదల చేశారని, ప్రస్తుత పరిస్థితుల్లో ఇది ఏమాత్రం సమంజసం కాదన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏపీఓ వసంతరావుకు అందజేశారు. కొక్కెర రమేష్, నల్లబోయిన కోటయ్య, జబ్బ రవి, నల్లెబోయిన సమ్మయ్య, పూనెం వరలక్ష్మి, ఎట్టి సారయ్య, అన్నవరం వెంకటేశ్వర్లు, కొమరం మాధవరావు, కంటెం రవి, ఎల్లయ్య, రాంచందర్, గంగయ్య, వాసం సారంగపాణి, సున్నం బుచ్చయ్య పాల్గొన్నారు.

ఉద్యోగులను, పెన్షనర్లను అవమానిస్తున్న ప్రభుత్వం



ఏపీఓకు వినతిపత్రం ఇస్తున్న బాధ్యులు

వెంకటాపురం(ఎం) : ఉద్యోగులకు, పెన్షనర్లకు 5 శాతం మధ్యంతర భృతి ఇవ్వడం భిక్షం వేసినట్లుగా ఉందని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ ఆసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంధె జగన్నాథం, ప్రధాన కార్యదర్శి తంగెళ్లపల్లి రాజయ్య ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. 20 నుంచి 30 శాతం భృతి ఇవ్వాల్సి ఉండగా 5 శాతం భృతిని ప్రభుత్వం ప్రకటించడం ఉద్యోగులను, పెన్షనర్లను అవమానించడమేనని అన్నారు. గత పీఆర్‌సీతో 31 నెలలు నష్టపోయామని, జూలై నుంచి ఇవ్వాల్సిన డీఏ ఇప్పటివరకు ఇవ్వలేదని ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా గురువారం ములుగు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఉద్యోగులు, పెన్షనర్లు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

భూ పత్రాల అందజేత



సర్పంచ్‌కు పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్

ఏటూరునాగారం : అభివృద్ధి చెందుతున్న ఏటూరునాగారం గ్రామంలో ఇప్పటి వరకు అటవీశాఖ ఆధీనంలో ఉన్న రెవెన్యూ భూమిని తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ కుమార్ బుధవారం మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ ఈసం రామ్మూర్తికి భూమి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ వద్ద అటవీశాఖ ఆధీనంలో ఉన్న సెంట్రల్ నర్సరీకి చెందిన 5.7 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ శాఖ ద్వారా గ్రామ పంచాయతీకి అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఈ స్థలంలో మోడ్రన్ గ్రామ పంచాయతీ, ఈజీఎస్ ద్వారా మోడ్రన్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్, కూరగాయల సంత, ఇతర అవసరాల కోసం ఉపయోగిస్తామన్నారు. అలాగే చిల్డ్రన్ పార్క్ కూడా తొలగించాల్సి ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో నగర పంచాయతీ, మున్సిపాలిటీ అయినా కూడా గ్రామ సచివాలయం సరిపోయే విధంగా నూతన హంగులతో నిర్మించడానికి పక్కా ప్రణాళికను చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, జీసీ సిబ్బంది రవీందర్, వెంకన్న, దయాకర్, సీనియర్ అసిస్టెంట్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



చిట్యాల: చీరలు అందజేస్తున్న బాధ్యులు



మల్హర్‌లో.. ఎంపీపీ, తహసీల్దార్

చిట్యాల : రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డలకు అందజేస్తున్న బతుకమ్మ కానుక చీరలను జెడ్పీటీసీ గొర్రె సాగర్, ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి బుధవారం మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ పూర్ణచందర్‌రావు అధ్యక్షతన బతుకమ్మ చీరల పంపిణీ చేపట్టారు. అనంతరం వారు హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించుకునే అతి పెద్ద పండుగ బతుకమ్మ, దసరా అని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్ రెడ్డి, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు మడికొండ రవీందర్‌రావు, ఎంపీటీసీ కట్కూరి పద్మ నరేందర్, మండల కోఆప్షన్ సభ్యులు ఎండి రాజ్‌మహ్మద్, తహసీల్దార్ సుమన్, ఎంపీడీఓ రామయ్య, వివిధ వార్డు సభ్యులు, నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మల్హర్‌లో..

మల్హర్ : మండలంలోని తాడిచర్ల పంచాయతీలో ఆడపడుచులకు బతుకమ్మ చీరలను ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు, తహసీల్దార్ శ్రీనివాసులు బుధవారం అందజేశారు. మండల వ్యాప్తంగా 9,863 మంది మహిళలకు బతుకమ్మ చీరలు మంజూరైనట్లు తహసీల్దార్ తెలిపారు. రేషన్ షాపుల్లో మహిళలకు చీరలను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్తయ్య, ఎంపీటీసీ రావుల కల్పన మొగిళి, ఎంపీడీఓ నరసింహ మూర్తి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి చిరుధాన్యాలు మేలు



ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్, అధికారులు

పలిమెల : ఆరోగ్యానికి చిరుధాన్యాలు ఎంతో మేలని తహసీల్దార్ హేమ అన్నారు. మహాదేవ్‌పూర్ ప్రాజెక్ట్ పరిధి పలిమెల మండలంలోని పలిమెల, పంకెన, సర్వాయిపేట, నీలంపల్లి, మోదేడు, ముకునూర్, బూరుగ్గుడెం గ్రామ పంచాయతీల పరిధిలో బుధవారం పోషణ్ అభియాన్‌లో భాగంగా సంకల్ప సప్తా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నప్రాసన, సీమంతాలు, చిరుధాన్యాలు, పెరటి తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, ఏఎన్ఎం పద్మ, సూపర్‌వైజర్ శివరాణి, అధ్యాపకులు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సమ్మెతో నిలిచిన తపాలా సేవలు

కాటారం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోస్టల్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన ఒక్క రోజు సమ్మెతో బుధవారం గ్రామాల్లో తపాలా సేవలు నిలిచిపోయాయి. తపాలా ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడంతో బట్వాడా ఆగిపోయింది. సమ్మెను ఏఐజీడీఎస్‌యూ మంథని, గోదావరిఖని సెక్రటరీ కుడుదుల కిష్టయ్య పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కిష్టయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా జీడీఎస్‌లు విడతల వారిగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గతంలో జీడీఎస్‌లు సమ్మె ద్వారా కొన్ని డిమాండ్లను నెరవేర్చుకోవడం జరిగిందని కానీ వారికి అందాల్సిన సౌకర్యాలను తొక్కి పెడుతూ వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. కనీస వేతనాలు అందడం లేదని, కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సు చేసిన అనేక ప్రయోజనాలను ప్రభుత్వం అమలు చేయడం లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ముదిరాజ్‌లు

చిట్యాల : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చిత్రపటానికి స్థానిక ముదిరాజ్ కులస్తులు బుధవారం మండల కేంద్రంలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం ముదిరాజ్ మండల అధ్యక్షుడు పుట్ట మొగిలి మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తులకు జిల్లా కేంద్రంలో 30 గుంటల భూమి, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికిరూ.10 లక్షల నిధులు కేటాయించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో ఆయనకు అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు సాద మల్లయ్య, పిట్టల మొగిళి, రమేష్, రఘు, రాయమల్లు, స్వామి, చంద్రయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ‘ఆరు గ్యారంటీ’లు



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ములుగు రూరల్ : వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని జిల్లా మహిళా కార్యదర్శి సూదిరెడ్డి జయమ్మ అన్నారు.ఈ మేరకు బుధవారం గోవిందరావుపేట మండలకేంద్రంలోని తారకరామ కాలనీలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతోందని అన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇస్తే ధనిక రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా మార్చారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలం లేని వారికి స్థలం కేటాయించి నిర్మాణానికి రూ.5లక్షలు, రూ. 500లకు గ్యాస్ సిలిండర్, రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.10లక్షల వరకు ఉచిత వైద్యం, ఉన్నత చదువులకు విద్యార్థులకు రూ. 5లక్షల ఉచిత సదుపాయం, గృహజ్యోతి పథకం ద్వారా మహిళలకు రూ. 2,500 చెల్లిస్తామని, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అమలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో గోపిదాసు వజ్రమ్మ, ప్రమీల, మణి, లక్ష్మి, దేవమ్మ, శివ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం



టీషర్టులు పంపిణీ చేసి అభినందిస్తున్న ఎస్సై

మంగపేట : క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని విద్యార్థి దశలో క్రమశిక్షణను పెంపొందిస్తాయని ఎస్సై గోదరి రవికుమార్ అన్నారు. మండలంలోని తిమ్మంపేటలో ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించి మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభను కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఆయన బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అభినందించారు. అనంతరం టీ షర్టులను అందజేశారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రస్తుత సమాజంలో రోజు రోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలను నియంత్రించేందుకు ప్రజల్లో అవగాహన ముఖ్యమని ఎస్సై రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సైబర్ నేరాల నియంత్రణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరగాళ్లు అన్ని వర్గాల ప్రజలను లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడుతున్నారన్నారు. వాటిలో ఓటీపీ, ఉద్యోగ అవకాశాలు, లోన్ యాప్, సోషల్‌మీడియా తదితర వాటిద్వారా జరుగుతున్నాయన్నారు. వీటిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. తోటి వారికి అవగాహన కల్పించాలని విద్యార్థులకు ఎస్సై రవికుమార్ సూచించారు.

అంగన్‌వాడీల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో అంగన్‌వాడీలు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బుధవారం అంగన్‌వాడీ టీచర్లు రాణి, జగదీశ్వరి, జ్యోతి, సునీతలను పోలీసులు అదుపులో తీసుకున్నారు.